# తెలివితేటలన్నీ పేదరికానికి బలయిపోయిన ఆ విద్యార్థి భవిష్యత్తు!

# విద్యార్థి

శశీశర్మ
కథ

అటు ఇటూ చూసి రోడ్డు జాగ్రత్తగా దాటుతున్నాడు సూర్యం. మూడు రోజులనుండీ ఎండ దంచేస్తోంది. నుదుట పట్టిన చెమటను తుడుచుకుంటూ, చేతిలో వున్న నాలుగు బరువైన పుస్తకాలను సరిగ్గా సర్దుకుంటూ గబగబా నడవసాగాడతడు. టైము నాలుగైంది. ఈపాటికి మమ్మీ ఇంటికి వచ్చేసి వుంటుంది అనుకుంటూ సందు మలుపు తిరిగాడు. మలుపు తిరిగాడు - కాలి చెప్పు టక్కున తెగింది. ఎక్కడ లేని నీరసం వచ్చింది సూర్యంకి. కొని ఆర్నెల్లు అవ్వలేదు. ఇది కొనడానికి ఎన్నాళ్లు ఆగాల్సివచ్చిందో, ఎంత ఆలోచించవలసి వచ్చిందో! నిట్టూరుస్తూ ఇల్లనబడే ఆ చిన్న రేకుల గదివైపు నడిచాడు.


''వచ్చావా నాన్నా, ఇంకా రాలేదేమిటా అని అనుకుంటున్నాను. ఇదిగో టీ తాగు ముందు'' సీతమ్మ గబగబా టీ వెచ్చపెట్టి ఇచ్చింది మనవడికి.

''నువ్వు తాగావా?''

''లేదులేరా... తాగాలని లేదు. అదీకాక ఇంటికి వచ్చేముందే మూర్తిగారింట్లో మజ్జిగ తాగాను. అన్నట్లు వాళ్లింటినుంచి ఇడ్లీలు తీసుకువచ్చాను తిను. అమ్మగారు నీకనే ఇచ్చారు'' సీతమ్మ అన్న మాటలువిని ఆమె కళ్లలో సూటిగా చూశాడు సూర్యం. పట్టుబడినట్లుగా తడబడుతూ ఏదో పని ఉన్నట్లు అక్కడినుంచి లేచి వెళ్లిపోయిందామె.

చాలా బాధవేసింది సూర్యానికి. జీవిత చరమాంకంలో . హాయిగా, ప్రశాంతంగా వుండాల్సిన ఈ వయసులో తనకోసం, కేవలం తనకోసం బ్రతుకుతున్న మామ్మ!

కాలనీవాళ్లకి పొద్దున్నే పాలపాకెట్లు ఇంటిపనిచేసి, తెలిసిన నలుగురిళ్లలో



వంటపనిచేసి, వాళ్లిచ్చింది జాగ్రత్తగా తనకోసం దాచిపెట్టి, తాను పస్తులుండైనా సరే, మనవడికి ఏ లోటు రాకూడదని అనుక్షణం తాపత్రయపడే మామ్మ! ఇడ్లీలు తిని, టీ తాగి, పెరటివైపు నడిచాడు సూర్యం.

''మామ్మా!'' ఆప్యాయంగా పిలుస్తున్న సూర్యంవైపు ఏమిటన్నట్టు చూసింది సీతమ్మ.

''రమేష్ దగ్గరకెళ్లి బ్రతిమాలి పుస్తకాలు

తెచ్చుకున్నాను మామ్మా! ఫైనలియర్ పరీక్షలైపోయిన వెంటనే ఇచ్చేయమన్నాడు. వాడొక్కడే కాస్త నయం. మిగతా మా ఫ్రెండ్స్, పరీక్షల టైంలో అసలివ్వరు. వాడే నాకు మంచి పెన్ను కూడా ఇచ్చాడు వాడుకోమని. అన్నట్టు కాలేజీలో రేపు హాల్‌టికెట్ ఇస్తారుట. పరీక్షలైన వెంటనే రమేష్ వాళ్ల మావయ్యను పరిచయం చేస్తాడుట. ఆయన నాకు తప్పకుండా తన ఫ్యాక్టరీలో ఉద్యోగం ఇస్తారుట. ఆయన చాలా మంచివాడని కూడా చెప్పాడు మామ్మా!''

మామ్మా... చూస్తూండు... నెల్లాళ్లలో పరీక్షలు... రిజల్ట్సు... ఫస్ట్ క్లాస్ ఖాయం... ఉద్యోగం ఖాయం... నీ కష్టాలు తీరడం మరీ మరీ ఖాయం'' కూడా కూడా తిరుగుతూ ఉత్సాహంగా చెప్పుకుపోతున్న మనవడిని చూస్తే ముచ్చటేసింది సీతమ్మకి.

''పిచ్చితండ్రీ... నా కష్టాలమాటేంకానీ... నువ్వు బాగా చదివి మంచి మార్కులు తెచ్చుకో. ఏమాత్రం వీలున్నా పై చదువులు చదువుదుగాని. నా గురించి ఆలోచించకు. అన్నట్టు పుస్తకాలు జాగ్రత్త. స్తోమత లేక నువ్వు కొనుక్కోలేకపోయావు. ఏదో దయతలచి నీ ఫ్రెండ్ ఇవ్వబట్టి సరిపోయింది. మళ్లీ వెంటనే ఇచ్చేయాలికదా'' సూర్యానికున్న రెండే రెండు జతల పాంటు చొక్కాలని జాగ్రత్తగా మడతపెడుతూ అంది సీతమ్మ.

''సరే మామ్మా... రాఘవ మాస్టారుగారి దగ్గరికెళుతున్నాను. కెమిస్ట్రీలో కొన్ని డౌట్లున్నాయి. తొందరగా వచ్చేస్తాలే'' తెగిన చెప్పుకు పిన్ను పెట్టుకుని బయటకు వెళ్తున్న మనవడిని చూసి నిట్టూర్చింది సీతమ్మ.

సీతమ్మకు ఒక్కడే కొడుకు. హోటల్‌లో వెయిటర్‌గా పనిచేసేవాడు. పెళ్లయి, సూర్యం పుట్టాక జీవితం కాస్త దారిలో పడిందనుకునే లోపల ఘోరం జరిగిపోయింది. తిరుపతి కొండ దిగుతూ, బస్సులోయలో పడిపోవడంతో, కొడుకు కోడలు అక్కడికక్కడే మరణించారు. అదృష్టవశాత్తు, మామ్మ దగ్గరుండిపోయిన సూర్యం బతకగలిగాడు. గుప్పెడంత గుండెలో, కొండంత దుఃఖం దాచుకుని, అప్పట్నించి సూర్యానికి తల్లిదండ్రి తానే అయి పెంచింది సీతమ్మ. చక్కగా చదువుకుంటూ, మామ్మ కష్టాన్ని అర్థం చేసుకుంటూ, డిగ్రీ ఫైనలియర్ దాకా రాగలిగాడు సూర్యం.

ఏ ఆధారం లేని సీతమ్మ, కేవలం మనవడి ఉన్నతిని చూసి ధైర్యంగా బ్రతుకు వెళ్లదీస్తోంది.

పుస్తకాలు, ఫీజులు ఆకాశాన్నంటుతున్నంత ఈరోజుల్లో, సూర్యం డిగ్రీ చదవడమే చాలా భారమైందామెకి. డిగ్రీలు చదివితే ఉద్యోగాలు వెంటనే వస్తాయన్న భ్రమలో వుంది సీతమ్మ. లోకం పోకడ తెలియని మనిషి.

ఆమె ఆశలను అడియాసలు చేయడం ఇష్టం లేక, ఎలాగైనా సరే, డిగ్రీ పూర్తిచేసి ఎవరికాళ్లో పట్టుకుని ఉద్యోగం చేసి, మామ్మను సుఖపెట్టాలని సూర్యం తాపత్రయపడుతున్నాడు. పైకి 'పై చదువులు' అంటూ అందేగాని, అది నిజంగా జరగదని, ఆమెకు తెలుసూ, ఇటు సూర్యానికీ తెలుసు.

మామ్మకి ధైర్యం చెప్పాలని... 'పాఠాలు తనకర్థమవుతున్నాయని... కావల్సిన పుస్తకాలు స్నేహితులిస్తున్నారని... సూర్యం చెప్తాడుకాని, అతను తన చదువుపట్ల లోలోపల ఎంత మదనపడుతున్నాడో అతనికే తెలుసు.

ఈ రోజుల్లో చదువుకోవాలి అంటే


చేతినిండా డబ్బుండాలి. కాలేజీలో చెప్పేవి సగం అర్థంకావు. శక్తి ఉన్నవాళ్లు వేలకు వేలు పోసి ట్యూషన్లు పెట్టించుకుంటున్నారు. ట్యూషన్లు చెప్పే మాస్టార్లు, కాలేజీలో ఇక చెప్పేదేవిటిలే అని నిర్లక్ష్యం చేస్తున్నారు. మార్కెట్లో కావాల్సిన పుస్తకాలు దొరకవు. దొరికినవి అందుబాటు రేటులో వుండవు. లైబ్రరీలో దొరికినవి చాలా కొంచెం. కాలేజీకి ఫండ్స్ లేవు. అందుకని పుస్తకాలు తెప్పించడంలేదు అని స్టాఫ్ చెప్తారు. దేశంలోని పార్టీల గొడవలు, మతకలహాలువల్ల సగం బంద్‌లు, సమ్మెలతో అయిపోతుంది. ఇక నిజంగా చదివేదెప్పుడు... చదివినది అర్థం చేసుకునేదెప్పుడు? విద్యార్థి దశంత నరకం ఇంకెక్కడా వుండదని సూర్యం ఎన్నోసార్లు అనుకుంటూ వుంటాడు. ముఖ్యంగా తనలాంటి బీదవారికి, భవిష్యత్తు గురించి కలలుగనలేక, వాస్తవంతో రాజీపడలేక, బ్రతుకు దుర్భరం అనిపిస్తుంటదతనికి.

చీకటిపడుతుండగా ఇల్లు చేరాడు సూర్యం.

● ● ●

ఫైనలియర్ పరీక్షలు మొదలయ్యాయి. ఒంటిమీద స్పృహలేకుండా సూర్యం కష్టపడి చదువుతున్నాడు. పరీక్షలు అతనికయితే తనకేమోనన్నట్లుగా హైరానా పడిపోతుంది సీతమ్మ. అప్పుచేసి, హార్లిక్సులు, పళ్లు, పాలు, అన్నీ కొని సూర్యానికి ఐటవము ప్రకారం అందిస్తోంది. మూర్తిగారిని బ్రతిమాలి ఫాన్ తెచ్చి పెట్టింది. ఎప్పుడు లేపమంటే అప్పుడు, ఎంత తెల్లవారు ఝామునలోనైనా సరే, లేని ఓపిక తెచ్చుకుని మనవడిని లేపి చదివిస్తోంది. అందుకోసం పక్కింటి సావిత్రిని అడిగి వాచీ తెచ్చింది.

పరీక్షల డేట్ తెలిసిన దగ్గరనుండి చాలా శ్రద్ధగా చదువుతున్నాడు సూర్యం. అతనికోసం నిద్రాహారాలు లేకుండా శ్రమ పడుతుందేమో... సీతమ్మకి ఒంట్లో ఓపిక నశిస్తోంది. ఎండాకాలం... పెద్ద వయసు... శక్తికి మించిన శ్రమ... వీటన్నింటితో సీతమ్మ ఆరోగ్యం రోజురోజుకి



క్షీణించిపోతోంది. ఇవేమీ సూర్యానికి తెలీకుండా జాగ్రత్తపడుతోందామె.

మొదటి రెండు పరీక్షలు చాలా బాగా రాసి, తృప్తిగా ఇంటికి వచ్చాడు సూర్యం. అతనికిప్పుడు, మునుపున్నంత భయం తగ్గింది. ఇంకా కొన్ని పేపర్లున్నాయి. మధ్యలో మూడు రోజులు సెలవులొచ్చాయి. ఆ సాయంత్రం రమేష్ వచ్చాడు.

''సూర్యం... రెండు పేపర్లు బాగా రాశావంటున్నావుకదా... ఆ పుస్తకాలు కావాలా... మా అన్నయ్యకి కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌కి ప్రిపేర్ అవ్వడానికి కావాలిట. రేపే ఢిల్లీ వెళ్తున్నాడు. ఇంక వాటి అవసరం నీకు లేదుగా. మిగతావి తర్వాత ఇద్దువుగానిలే''

రమేష్ అన్న మాటలకి ''మరేం ఫర్వాలేదురా... ఆయన మంచి పొజిషన్‌కి చేరుకోవాలని నేనూ కోరుకుంటున్నానురా... అయినా ఆ సబ్జక్ట్స్ అయిపోయాయిగా... బుక్స్ తీసుకో'' అంటూ పుస్తకాలు ఇచ్చాడు సూర్యం. రమేష్ అటు వెళ్లగానే కిరాణా ఆసామి వచ్చాడు.

''సీతమ్మా... వెచ్చాలు, బియ్యం, హార్లిక్సులు అన్నీ కలిపి బోలెడంత బాకీ పెట్టావు. ఎప్పుడు తీరుస్తావు?'' గట్టిగా అడుగుతున్న ఆసామిని చూసి సీతమ్మ లోపలినుండి గబగబా వచ్చింది.

''చూడు నాయనా... ఒక వారం ఓపిక పట్టు. అన్నీ కలిపి తీర్చేస్తాను. బాబు ముందు ఏమీ మాట్లాడకు'' సీతమ్మ మాటలకు సరేనంటూ వెళ్లిపోయాడు కొట్టు ఓనరు.

''నా కోసం ఊరికే ఖర్చుపెట్టకు మామ్మా'' అంటూ చదువు మొదలుపెట్టాడు సూర్యం.

పరీక్షరోజు పొద్దున్నే లేచి మామ్మ పెట్టిన ఉప్మా తిని, అన్నీ సరిగ్గా ఉన్నాయో లేదో చూసుకుని, మామ్మ కాళ్లకు దణ్ణం పెట్టి, కాలేజీకి వెళ్లాడు సూర్యం.

కోలాహలంగా, గుంపులుగుంపులుగా ఉన్న స్టూడెంట్స్‌ని చూసి, హడావుడికి కారణం తెలియక అయోమయంగా, పక్కన ఉన్న ఒక అబ్బాయిని కారణమడిగాడు.

నీకు తెలియదా అన్నట్టు ఎగాదిగా చూసి అతడు ''థర్డ్, ఫోర్త్ సైన్సు పేపర్లు లీక్ అయ్యాయిట. నిన్న రాత్రే ఒక్కొక్క పేపరు పాతిక వేల రూపాయలకి కోస్తా జిల్లాల్లో అమ్ముడుపోయిందిట. అన్ని పరీక్షలు క్యాన్సిల్ చేయాలని, వి.సి. రాజీనామా ఇవ్వాలని విద్యార్థి సంఘాలు గొడవపెడుతున్నాయి. ఎగ్జామినేషన్ హాలులో ఎవరూ ప్రవేశించరాదని స్టూడెంట్ లీడర్లు చెప్తున్నారు. ఈ పరీక్షలు మళ్లీ ఎప్పుడు పెడ్తారో... మనమేం రాస్తామో... గోవిందా గోవిందా...'' వివరంగా చెప్తున్న అతడి మాటలు విన్న సూర్యానికి నెత్తిన పిడుగు పడ్డట్టయింది. అప్రయత్నంగా కాళ్లలో వణుకు వచ్చిందతడికి.

''భగవంతుడా... ఇదెక్కడి ఘోరం... చచ్చి చెడి రాత్రి పగలు కష్టపడి చదివితే ఇలా జరిగిందేమిటి. ప్రభుత్వం అంత బాధ్యతా రహితంగా ఎలా చూస్తోంది. డిగ్రీ పేపర్లు లీక్ అయితే అలా పట్టనట్టు వి.సి. ఏం చేస్తున్నాడు. రాసిన పరీక్షలు కూడా క్యాన్సిల్ చేస్తే ఇక తనలాంటి బీదవాళ్ల గతేమిటి?'' సూర్యానికి దుఃఖం వచ్చేస్తోంది.

మామ్మ కష్టం, చేసిన అప్పు, అరువు తెచ్చుకున్న పుస్తకాలు అన్నీ కళ్లముందు కనపడుతున్నాయి. సూర్యంలాగా షాక్‌తో అక్కడ మరికొంతమంది విద్యార్థినీ విద్యార్థులు

పిచ్చిపట్టినట్టు తిరుగుతున్నారు.

''మా అమ్మ ఆరోగ్యం బాగా లేదురా. ఇలా పరీక్షలు క్యాన్సిల్ అయి మళ్లీ ఎప్పటికుంటాయి? నేను మళ్లీ మూడ్ తెచ్చుకుని ఎలా చదవను'' శ్రీధర్ అనే అబ్బాయి వాపోయాడు.

''నేను రూమ్ తీసుకున్న ఇంటిగలవాళ్లు ఈ నెలాఖరుకు ఖాళీచేయమన్నారురా. పరీక్షలు అయిపోతాయని చెప్పాను వాళ్లకి. ఇప్పుడు మళ్లీ ఎప్పటిదాకా ఈ ఎగ్జామ్స్‌కోసం వెయిట్ చేయాలి? మళ్లీ రూంకోసం ఏం వెతకను?'' బిక్కమొహంతో బాధపడ్డాడు మరో విద్యార్థి.

''మా అక్క పెళ్లి ముహూర్తం, నాకోసం ఇప్పటికే పోస్ట్‌పోన్ చేశారురా. ఇప్పుడే పరీక్షలకి దాని జీవితానికి లింక్ అయిపోయిందేవిటి?'' దాదాపు ఏడుస్తున్నట్టు చెప్పాడు మరో కుర్రాడు.

ఇలా అందరూ వారికున్న సమస్యలు చెప్తుంటే, ఉన్న ధైర్యంగూడా నీరుగారిపోయిందతడికి. కాళ్లీడ్చుకుంటూ ఇంటిదారి పట్టాడు. సూర్యం ఏడుస్తూ చెప్పింది విని, బెంబేలు పడిపోయింది సీతమ్మ. అప్పు, డబ్బు, ఇవన్నీ పక్కన పెడ్తే, తన ఆరోగ్యం క్షీణించిపోతోందే! ముఖ్యంగా చదివే మూడ్ పోగొట్టుకున్నాడే సూర్యం' ఏమిటిలా? ఎందుకు విద్యార్థి జీవితంతో ఆటలాడుకుంటున్నారు? లేని ధైర్యం తెచ్చుకుని; సీతమ్మ మనవడికి మంచి చెప్తోంది. భయపడకు అని ప్రోత్సాహమీయసాగింది.

ఇవాళ, రేపు అని ఏరోజుకారోజు పరీక్షల డేట్ గురించి వార్తలు తెలుస్తున్నాయి. విద్యామంత్రికి, విద్యార్థి సంఘాలకి చర్చలు జరుగుతున్నాయి. ఎవరో కోర్టులో కేసు వేశారు. నిరాశా నిస్పృహలతో సూర్యం రోజూ కాలేజీకి విషయం తెలియడంకోసం వెళ్లివస్తున్నాడు. ఎండల్లో బయటకు పనికి వెళ్లలేక, చేతిలో డబ్బులేక సీతమ్మ తల్లడిల్లిపోతోంది.

ఎలాగైతేనేం మే నెలాఖరులోని రోహిణి కత్తెర్లలో పరీక్షల డేట్ అనౌన్స్ చేశారు. అరువు తెచ్చుకున్న పుస్తకాలు ఇచ్చివేయడంతో, ఉన్న

## గొప్ప

''మనుషులకన్నా జంతువులు గొప్పవి!''

''ఎలా చెప్పగలవు?''

పాతిక గుర్రాలు మైదానంలో పరిగెడితే కొన్ని వేలమంది చూస్తారు, వందమంది జనం పరుగెత్తినా ఒక గుర్రమూ చూడదు!''

- పి. వి. మురళీకృష్ణ (హైదరాబాద్)



నోట్స్‌తో, క్రుంగిపోతున్న ఆత్మవిశ్వాసంతో చదివి పరీక్షలు పూర్తిచేశాడు సూర్యం.

వారం, పది రోజుల్లో రిజల్ట్సు ప్రకటిస్తామని, అందువల్ల విద్యార్థులు ఆందోళన పడనవసరంలేదని ముఖ్యమంత్రి కల్పించుకుని స్వయంగా స్టేట్‌మెంట్ ఇచ్చాడు.

అన్నట్టుగానే ఫలితాలు ప్రకటించారు. తెల్లవారుజామునే పేపరుకోసం ఆత్రుతగా లేచి సందపు చివర షాపుకెళ్లాడు సూర్యం.

ఒకటి... ఊహు... ప్రథమ శ్రేణిలో తన నెంబరు లేదు... స్థాణువయ్యాడు. సూర్యం.... పోనీ ద్వితీయ శ్రేణిలో... దేవుడా.... అందులోకూడా లేదు.... చదవడానికి కళ్లనీళ్లు అడ్డం పడుతుండగా తుడుచుకుని తృతీయశ్రేణి... అందులోకూడా లేదు నెంబరు. తన నెంబరు లేదు. పేపర్లో తన నెంబరు లేదు. తను ఫెయిల్ అయ్యాడు. మూడేళ్లు చీము నెత్తురు ధారపోసి చదివిన చదువుకు ఫలితం.... పేపర్లు లీకవ్వడం. సరైన పుస్తకాలు లేకపోవడం, తెలియకుండానే పరీక్షల మూడ్ పోవడం... డబ్బులేక తగినంత తిండిలేక ఆకలి తీరకపోవడం... దురదృష్టం... అన్నీ కలిసి... తనకి కానుకని ఇచ్చాయి. తను ఫెయిల్ అయ్యాడు.

గుండెలు పగిలేటట్టు ఏడుస్తున్న సూర్యాన్ని అక్కున చేర్చుకుంది సీతమ్మ. ''ఎందుకిలా జరిగింది మామ్మా? ఎందుకిలా జరిగింది'?''

సూర్యం ప్రశ్నకు సీతమ్మ ఏం సమాధానం చెప్పగలదు.

